ఎన్నాళ్లీ నత్తనడక?



కంకర తేలిన వట్‌పల్లి-దుద్యాల రోడ్డు

- గడువు దాటినా పూర్తికాని రోడ్డు పనులు
- కంకరపోసి వదిలేసిన కాంట్రాక్టర్
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వట్‌పల్లి(అందోల్): దేవుడు వరమిచ్చినా.. పూజారి కనికరించడం లేదు అన్నట్లుగా మారింది వట్‌పల్లి-దుద్యాల రోడ్డు దుస్థితి. ప్రజల సౌకర్యార్థం గ్రామీణ రోడ్లకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా గుత్తేదారుల అలసత్వం ప్రజలకు శాపంగా మారుతోంది. వట్‌పల్లి నుంచి దుద్యాలకు వెళ్లే రోడ్డు ధ్వంసం కావడంతో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ 3.29 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణం కోసం 2021లో రూ.171.86 లక్షల నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కానీ కాంట్రాక్టరు 0.46 కిలోమీటర్ల దూరం సీసీ రోడ్డు, రెండు కల్వర్టుల నిర్మాణాలను మాత్రమే చేపట్టి 2.83 కిలోమీటర్ల దూరం కంకర వేసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.

తరచు ప్రమాదాలు..

కంకర తేలిన రోడ్డుపై తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పంచాయితీరాజ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నెలల తరబడిగా పనులు నిలిచిపోవడంతో దుమ్ముధూళి వస్తుండడంతో రోగాల పాలవుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టరుకు నోటీసులిస్తాం

రోడ్డు నిర్మాణ పనులను గతేడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాల్సి ఉండేది. కానీ.. సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేయంతో నోటీసులు ఇచ్చి పనులు చేపట్టాలని తెలియజేస్తాం. అయినప్పటికీ పనులు చేపట్టకపోతే కాంట్రాక్టర్ లైసెన్సు బ్లాక్ లీస్టులో పెట్టడమా, రద్దు చేయడమా చేసి మరో కాంట్రాక్టరుకు అప్పగించి పనులు పూర్తి చేస్తాం.

– మొగులయ్య, పంచాయతీరాజ్, ఏఈ

క్లుప్తంగా

హోంమంత్రి మహమూద్ అలీకి ఆహ్వానం



ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: రంజాన్ పర్వదినం పురస్కరించుకుని సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ నెల 12న బుధవారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న నియోజకవర్గస్థాయి ప్రభుత్వ ఇఫ్తార్ విందుకు హాజరుకావాలని కోరుతూ మంత్రి మహమూద్ అలీకి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం ఆహ్వానపత్రికను అందజేశారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్

సంగారెడ్డి టౌన్ : జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ భవనానికి ఎకరా భూమి కేటాయించాలని లింగాయత్ సమాజం సభ్యులు డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్కాపురం శివకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ శరత్ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 20 గుంటల భూమిని కేటాయించారని, కానీ.. భవన నిర్మాణానికి ఆ స్థలం సరిపోకపోవడంతో ఎకరా భూమిని కేటాయించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అధ్యక్షుడు ప్రసాధి మధుశేఖర్, సులుగంటి సిద్ధేశ్వర్, అడికె జగదీశ్వర్, వీరన్న పాటిల్, కౌన్సిలర్ రామప్ప, కంది వీరేశం, శివరాజ్ పాల్గొన్నారు.

మైక్‌సెట్ అందజేత



మైక్‌సెట్‌ను చూపుతున్న మైనార్టీలు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని నర్రిగూడ గ్రామంలోని మజీదుకు సోమవారం చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ.30వేల విలువ చేసే మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మైనార్టీ సోదరులు నీలం మధుకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఈదుల నాగులపల్లిలో శంషాబాద్ నరసింహులు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు బీజేపీ కౌన్సిలర్ శంషాబాద్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.

బస్‌పాసుల పంపిణీ



బస్‌పాసులను అందజేస్తున్న డిపో మేనేజర్

న్యాల్‌కల్(జహీరాబాద్): స్థానిక ఐకేపీ కార్యాలయంలో సోమవారం దివ్యాంగుల బస్‌పాసు మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లేశం, ఐకేపీ ఏపీఎం కుమార్‌లు బస్సుపాసులను పంపిణీ చేశారు. 25 మందికి బస్సుపాసులను అందజేసినట్లు, మిగిలినవారు నెలాఖరు వరకు పాసులను తీసుకోవాలని డీఎం మల్లేశం సూచించారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమాల మాణిక్ అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన పూలే, అంబేడ్కర్ సందేశ్‌బైక్ యాత్రను సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మహేష్, సీఐటీయూ నాయకులు మహిపాల్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: బీఆర్‌ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్‌అబిద్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి అభినందించారు. పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి రామరాజునగర్‌లో అబ్దుల్ అబిద్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా రంజాన్‌మాసం పర్వదినం సందర్భంగా సోమవారం వికలాంగులు, ముత్తంగి గ్రామ పంచాయతీ వర్కర్లు, నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గూడెం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కొంతకాలంగా అబిద్ కుల, మతాలకతీతంగా పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకువెళ్లడంతో పాటు సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, అబ్దుల్ ఖాదర్, మేరాజ్‌ఖాన్, నిజాంఖాన్, సోయాల్‌ఖాన్, అబ్దుల్ సలీం, రామకృష్ణ పాల్గొన్నారు.

మల్లన్నస్వామికి పూజలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని భానూర్ గ్రామంలో కొనసాగుతున్న మల్లన్నస్వామి జాతరలో భాగంగా సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు శివ, ప్రధాన కార్యదర్శి సాయిగౌడ్, ఓబీసీ కార్యదర్శి రాందాస్, సీనియర్ నాయకులు రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై విచారణ జరిపించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రాష్ట్ర వైఎస్సార్‌టీపీ అధికార ప్రతినిధి సంజీవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జోగిపేటలోని తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీతో వేలాది మంది విద్యార్థులకు, నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు రాకేష్, సంగన్న, శ్రీహరి, ఉదయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు ప్రభుత్వం కృషి

కల్హేర్(నారాయణఖేడ్): అంధత్వ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందని సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నముబారక్‌పూర్‌లో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్వడ స్వప్న, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతించాలని నిరసన



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇళ్ల నిర్మాణాలకు అనుమతించాలని న్యాల్‌కల్ మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులు డిమాండ్ చేశారు. తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టవద్దంటూ అధికారులు ఆదేశిస్తున్నారని నిరసిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు 2006–07లో ల్యాండ్ పర్చేజ్ పథకంలో భాగంగా న్యాల్‌కల్‌లోని సర్వే నెంబర్ 242, 247లో 7 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. అట్టి స్థలంలో కొంతమంది లబ్ధిదారులకు అప్పట్లో ఇళ్ల స్థలాలను కేటాయించి సర్టిఫికెట్ల అందజేశారన్నారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టడంలో ఆలస్యం జరిగిందన్నారు. తమకు కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడితే అధికారులు వచ్చి నిర్మాణాలు చేపట్టవద్దని అడ్డుకుంటున్నారని వాపోయారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమైన తహసీల్దార్ అంటోనిని వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఐకేపీ వీవోలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న విద్యాసాగర్

జోగిపేట(అందోల్): ఐకేపీ వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.10లక్షల సాధారణ భీమా, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆందోల్ డివిజన్ సీఐటీయూ కార్యకర్తల సమావేశాన్ని జోగిపేట మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెర్ప్ నుంచి ఐడీ కార్డులు ఇవ్వాలని, గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెల వేతనాలు వీవోఏల వ్యక్తిగత ఖాతాలో వేయాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా లక్ష్మీరెడ్డి, కార్యదర్శిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా నరేందర్‌గౌడ్ స్వప్న, అనిత, కోశాధికారిగా కిష్టయ్య, సహాయ కార్యదర్శులుగా విజయ, ధనలక్ష్మి, స్వప్న, సలహాదారుగా మల్లన్నతో నూతన కమిటీ ఎన్నుకున్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు:ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్‌కు బలం, బలగం కార్యకర్తలేనని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం బీరంగూడలోని ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ మున్సిపల్, మండల స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 60లక్షల మంది సభ్యత్వంతో బీఆర్‌ఎస్ రాష్ట్రంలోనే అజేయశక్తిగా నిలిచిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అమీన్‌పూర్ బీరంగూడ నుంచి కిష్టారెడ్డిపేట వరకు 100 ఫీట్ల రహదారిని నిర్మించడంతో పాటు తాగునీటి సమస్యకు పరిష్కరించేందుకు నాలుగు భారీ రిజర్వాయర్ల నిర్మాణ పనులను చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు ఈర్ల రాజు, వైస్‌ఎంపీపీ సునీత సత్యనారాయణ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

జిన్నారం(పటాన్‌చెరు): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించారు. గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో కామరతి బీరప్ప, గుమ్మడిదల గ్రామంలో మల్లికార్జునస్వామి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీన, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పటాన్‌చెరు: గ్రామాల అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన బసిరెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి తన తండ్రి బసిరెడ్డి ప్రతాపరెడ్డి జ్ఞాపకార్థం గ్రామ అవసరాలకు సొంత నిధులతో ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా ట్రాక్టర్‌ను గ్రామ పంచాయతీకి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్యాంసుందర్ రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కావ్యకాశిరెడ్డి, ఎంపీటీసీ నీనా చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం ఝరాసంగంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు 24 గంటల విద్యుత్, పెట్టుబడి సహాయం రైతుబంధు, రైతు బీమా, డబుల్ బెడ్‌రూం వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచయ్యస్వామి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, కేతకి ఆలయ చైర్మన్ వెంకటేశం, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి

కోహీర్(జహీరాబాద్): రెండవ విడత గొర్రెల పంపిణీని పారదర్శకంగా చేపట్టాలని జెడ్పీటీసీ రాందాస్ అధికారులను కోరారు. సోమవారం ఎంపీపీ సమావేశ మందిరంలో గొర్రెకాపరుల సహకార సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అక్రమాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ అధికారిణి జీనత్‌భాను, ఎంపీపీ మాధవి, గొర్రెకాపరుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): రెండవ విడతలో భాగంగా గొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టబోతున్నందునా అర్హుల జాబితాలో ఉన్న వారు వెంటనే బెనిఫిషరీ కంట్రిబ్యూషన్‌ను చెల్లించాలని అందోలు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ గీత సూచించారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గొర్రెల పెంపకదారుల సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హుల జాబితాలో ఉండి చనిపోయిన వారి స్థానంలో నామిని పేర ఉన్న వారికి అవకాశం కల్పిస్తారని తెలిపారు. గ్రామసభలో సెలెక్ట్ అయి పేర్లు రానట్లయితే ఆన్‌లైన్‌లో సరిచేసేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. లబ్ధిదారులు కంట్రిబ్యూషన్ చెల్లింపుతో పాటు కుల ధృవీకరణ సర్టిఫికెట్‌ను అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీపీ బాలయ్య,పాల్గొన్నారు.

రేపు అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు

కొండాపూర్(సంగారెడ్డి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ఈ నెల 12న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గణితం, కంప్యూటర్ సైన్స్ తరగతులు బోధించేందుకు సంబంధిత పీజీలో 55 శాతం ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. పీహెచ్‌డీ ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 12న ఉదయం 10–30 నిమిషాలకు కళాశాలలో నిర్వహించే డెమో, ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 12న జిన్నారంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12న మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రముఖ ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: రంజాన్‌ను పురస్కరించుకొని మండలంలోని ముత్తంగి గ్రామ పరిధిలోని రామరాజునగర్ కాలనీలో బీఆర్‌ఎస్ మండల మైనార్టీ అధ్యక్షుడు ఆబెద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందుకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సపానదేవ్, అఫ్జల్, మెరాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **హుండీ ఆదాయం లెక్కింపు**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయ హుండీ ఆదాయాన్ని సోమవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈఓ శశిధర్‌ల ఆధ్వర్యంలో లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.21.34లక్షలు వచ్చిందని శివారాజ్ తెలిపారు.

◆ **పేదలకు వైద్యసేవలు అందించండి**

జిన్నారం(పటాన్‌చెరు): పారిశ్రామికవాడల్లో అన్ని రాష్ట్రాల ప్రజలు నివాసం ఉంటున్నారని, వారికి మరిన్ని వైద్యసేవలను అందించేలా మమత ఆసుపత్రి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి, గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశ్‌చారిలు కోరారు. సోమవారం మమత ఆసుపత్రి ఎండీ పువ్వాడ నయన్‌రాజ్‌ను బొల్లారం, గడ్డపోతారం పారిశ్రామికవాడల ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎండీ పువ్వాడ నయన్ రాజ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

◆ **3,318 క్వింటాళ్ల శనగలు కొనుగోలు**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 'వరం రైతు సంఘం' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు 3,318 క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేసినట్లు ఆ కేంద్రం సీఈఓ సీలయ్య తెలిపారు. నిల్వ చేసిన శనగబస్తాలను మార్క్‌ఫెడ్ గోదాంలకు తరలిస్తున్నామన్నారు. త్వరలో మరోసారి శనగల కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. క్వింటాలు శనగలను రూ.5,335 ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు.

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలం ఉట్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఖేడ్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన గాలప్ప, సంగప్ప, హన్మంత్, నాగ్‌నాథ్, మారుతి, రమేష్ తదితరులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు మాణిక్‌రావు, పండరినాథ్, సుభాష్‌పటేల్, బస్వరాజ్, కొండల్‌రెడ్డి, శివ, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **వైకుంఠ రథం ప్రారంభం**



ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగం గ్రామానికి అందించిన వైకుంఠరథాన్ని ఎమ్మెల్యే మాణిక్‌రావు స్థానిక నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తన తండ్రి నీల సంగయ్య జ్ఞాపకార్థం రూ.2లక్షలతో వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేయించినట్లు కేతకి ఆలయ చైర్మన్ వెంకటేశం తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదీశ్వర్, మెదపల్లి సర్పంచ్ పరమేశ్వర్ పటేల్, నాయకులు సంతోష్ కుమార్, హఫీజ్, నర్సింలు, బస్వరాజ్ పాటిల్, కిషన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **ఘనంగా వీరభద్రేశ్వర జాతర ప్రారంభం**

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని వీరభద్రేశ్వర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో మొదటి రోజైన సోమవారం అభిషేకం నిర్వహించారు. జాతరకు విచ్చేసిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. మంగళవారం పల్లకీసేవతో అగ్నిగుండం దాటే కార్యక్రమం, రుద్రాభిషేకం, గణపతి హోమం, వీరభద్రేశ్వర కల్యాణోత్సవం ఉంటాయని తెలిపారు. వీరభద్రేశ్వర ఆలయం నుంచి బసవేశ్వర దేవాలయం వరకు రథోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

◆ **నీలం మధుకు సన్మానం**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని అనంతారం, గుమ్మడిదల గ్రామాల్లో సోమవారం నిర్వహించిన మల్లికార్జునస్వామి ఉత్సవాలకు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహకులు నీలం మధును ఘనంగా సన్మానించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

◆ **చలివేంద్రం ఏర్పాటు**

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని గౌడిగార్‌పల్లి ప్రధాన చౌరస్తాలో బసవేశ్వర విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. చత్రపతి శివాజీ మహారాజ్ నిర్మించిన భవానీమాత మందిరానికి వెళ్లే భక్తులతో పాటు ప్రజలకు నీటిసౌకర్యం కల్పించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చలివేంద్రం నిర్వహకులు విఠల్‌గౌడ్, గణేష్ (ఆర్మీ సైనికుడు), కృష్ణ, ఖన్న, సామెల్, నర్సింలు పాల్గొన్నారు.

◆ **గ్రామాల అభివృద్ధే లక్ష్యం**

మునిపల్లి(అందోల్): గ్రామాల అభివృద్ధే లక్ష్యమని జడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని మక్తక్యాసారం గ్రామంలో సర్పంచ్ మల్లేశం అధ్వర్యంలో రూ. 27 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులతో పాటు ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ సహకారంతో పార్టీలకతీతంగా మునిపల్లి మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మినాగేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆనెగుంటలో కంటివెలుగు శిబిరం**

జహీరాబాద్: మండలంలోని ఆనెగుంట గ్రామంలో ఉచిత కంటివెలుగు శిబిరాన్ని సోమవారం ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, సర్పంచ్ అంబూలాల్ రాథోడ్, పంచాయతీ కార్యదర్శి భీమ్‌రావు, ఉపసర్పంచ్ నారాయణ, పాల్గొన్నారు.

◆ **సేంద్రియ వ్యవసాయంపై ఉచిత శిక్షణ**

జహీరాబాద్: చిరుధాన్యాల సాగు, సేంద్రీయ వ్యవసాయంపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త స్నేహ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుకు వస్తే 30 మంది బ్యాచ్‌తో శిక్షణ కార్యక్రమం ప్రారంభించి వారం రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమానికి వచ్చే వారికి ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సంగారెడ్డి జిల్లా రైతులు, మహిళా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు 7569984438ను సంప్రదించాలన్నారు.

◆ **రామలింగేశ్వర ఆలయంలో పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది గ్రామంలోని పురాతనమైన రామలింగేశ్వర ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి పరమ శివుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ **వైభవంగా బీరప్పస్వామి కల్యాణం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెల్టూర్, నాగులపల్లి గ్రామాల్లో కామరాతి బీరప్ప స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ కుమారుడు చింతా సాయినాథ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **పరీక్ష ప్యాడ్లు పంపిణీ**



ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని చిలపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం కుప్పనగర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సీఆర్‌పీ షఫీయోద్దీన్ పరీక్షా ప్యాడ్లు, కంపాస్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు షఫీయోద్దీన్‌ను ఘనంగా సన్మానించారు.